P-01_Layout 2 20-Aug-26 02:12 AM Page 1

RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 314 | సంపుటి 4 | గురువారం | 20-08-2026 | పేజీలు 4 | వెల 3/-

## సర్ ప్రక్రియను
# పకడ్బందీగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను ప్రారంభించాలి
- డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలి
- అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అన్ని చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి




మహబూబాబాద్ ఆగస్టు 19(ప్రభాత గమనం):

సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐ.డి.ఓ.సి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్ని స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి నుంచి వచ్చే అభిప్రాయాలు, క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ జరగని ఓటర్ల వివరాలను పరిశీలించాలని, సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టి, సంబంధిత ఓటర్లకు తమ వివరణను అందించే అవకాశం కల్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోటీసుల జారీ అనంతరం ఓటర్ల నుంచి అందే వివరణలు, సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీసీ లో కలెక్టర్ మాట్లాడుతూ..మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా జిల్లాలో అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్ ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## కేసుల సత్వర పరిష్కారంపై
# సీడీఓలకు ఎస్పీ కీలక ఆదేశాలు

ప్రభాత గమనం.వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు కోర్టుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా సీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, సూచించారు. జిల్లా జడ్జి కె. మురళీ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ.. పోలీస్, న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయం, పెండింగ్ కేసుల పరిష్కారం, సాక్షుల హాజరు, కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు. అనంతరం మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో జిల్లాలోని సీడీఓలతో సమావేశం నిర్వహించి కేసుల దర్యాప్తు, కోర్టు విచారణ, శిక్షల సాధనపై సమీక్షించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని సూచించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. ICJSలో వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు e-Summons వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో చట్టపరమైన చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. కేసు నమోదు నుంచి కోర్టులో తుది తీర్పు వరకు సమర్థవంతంగా ఫాలోఅప్ చేస్తూ శిక్షల శాతం పెంచేలా పనిచేయాలని సీడీఓలకు ఎస్పీ స్పష్టం చేశారు.

# రాజీవ్ గాంధీ జయంతి వేడుకలకు కాంగ్రెస్ శ్రేణులు హాజరు కావాలి

గార్ల, ఆగస్టు 19 (ప్రభాత గమనం):

మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం గార్ల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణా గౌడ్ తెలిపారు.గార్ల మండల కేంద్రంలోని సీతంపేట రోడ్డులో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తాళ్లపల్లి కృష్ణా గౌడ్ కోరారు.కార్యకర్తలు, నాయకులు సకాలంలో కార్యక్రమానికి చేరుకుని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించడంతో పాటు జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# టీయూడబ్ల్యూజే హెచ్ 143 మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం ఆగస్టు 19(ప్రభాత గమనం):

కేసముద్రం మండలం పరిధిలో పనిచేస్తున్న విలేకరుల నూతన మండల కమిటీని మంగళవారం సాయంత్రం ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం సాయంత్రం టీయూడబ్ల్యూజే హెచ్ 143 అనుబంధ మండల కమిటీ అధ్యక్షుడిగా వార్త దినపత్రిక విలేఖరి ఏసల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సోమారపు శ్రీరాములు, జన్ను శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కూన శ్రీను, సహాయ కార్యదర్శులుగా పందుల రవిచంద్ర, వల్లాల కాశ్మీనాథ్, కోశాధికారిగా వేల్పుల రేవంత్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా మిట్టగడుపుల మహేందర్, గాజుల రవి, చంద్రగిరి వంశీకృష్ణ, శీలం దామోదర్, బోడ ప్రశాంత్ ను ఎన్నుకున్నట్లు కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో కన్వీనర్ గాడిపెల్లి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక కన్వీనర్ మద్దినేని గుట్టయ్య మాట్లాడుతూ...పత్రికా రంగంలో పని చేస్తున్న ప్రతి విలేకరికి ఎల్లప్పుడూ అండగా టియుడబ్ల్యూజే హెచ్ 143 ఉంటుందని, ప్రతి ఒక్కరూ సహకరించుకుంటూ యూనియన్ బలాన్ని పెంచాలని కోరారు. అలాగే మండలం నుండి అధిక సంఖ్యలో సభ్యత్వాలను చేపట్టాలని సూచించారు.

## గార్లలో ప్రత్యేక
# సర్వసభ్య సమావేశం

గార్ల, ఆగస్టు 19 (ప్రభాత గమనం):



మండల అభివృద్ధి, పరిపాలనా వ్యవహారాలపై సమగ్రంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునేందుకు గార్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో మంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల ప్రత్యేక అధికారి జి. దేశీరాం నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామాల అవసరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలపై చర్చించాలని సూచించారు. మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటిస్తూ ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో మంగమ్మ స్పష్టం చేశారు.






# సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలి

- ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

ప్రభాత గమనం.వరంగల్ క్రైమ్ బ్యూరో

సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ఎస్పీ.. జిల్లాలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, కోర్టు కేసులు, శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని, పక్షపాతం లేకుండా బాధితులందరినీ సమానంగా చూడాలని సూచించారు. కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో సాక్షులు, నిందితులకు సమన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, నేరస్తులకు శిక్షలు పడేలా కోర్టు కానిస్టేబుళ్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. కొత్తగా నమోదైన కేసులతో పాటు పాత కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల కేసుల్లో దర్యాప్తును ముమ్మరం చేసి పోగొట్టుకున్న నగదు, వస్తువులను బాధితులకు తిరిగి అందించేలా కృషి చేయాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచి చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత బలికాకుండా పోలీస్ స్టేషన్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బెట్టింగ్‌ను ప్రోత్సహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు సర్టిఫికెట్లను అందజేశారు. సమావేశంలో ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ భట్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, డీసీఆర్బీ సిబ్బంది, ఐటీ కోర్ టీం సభ్యులు పాల్గొన్నారు.